## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ కాకినాడ హార్బర్ ఆధునికీకరణకు 72 కోట్ల రూపాయల నిధులను కేటాయించామని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు.
- ❖ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.
- ❖ గిరిజన విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలియజేశారు.

====================

బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖ పర్యటనలో భాగంగా ఆయన ఈరోజు సీఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో.. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్, కె. రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సముద్ర ఆహార ఉత్పత్తులలో ఆంధ్రప్రదేశ్ రెండవ అతి పెద్ద రాష్ట్రమని, రాష్ట్రంలో 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. ఆక్వా ఉత్పత్తులను మరింత పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న ఆయన.. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రం తీసుకునే చర్యలకు రాష్ట్రం తరుపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఆక్వా రంగానికి భారతదేశం లైట్ హౌస్‌లా ఉండాలని, ఆ లైట్ హౌస్‌కు ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా వెలగాలని ఆకాంక్షించారు. ఆక్వా అభివృద్ధికి అవసరమైన పర్యావరణాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకెన్లు)

====================

కాకినాడ హార్బర్ ఆధునికీకరణకు 72.42 కోట్ల రూపాయల నిధులను కేటాయించామని కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ, పంచాయితీ రాజ్ శాఖల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. విశాఖపట్టణంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. దేశీయ సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్య భూమిక పోషిస్తోందని చెప్పారు. చేపలు, రొయ్యల ఉత్పత్తిలో 50 లక్షల టన్నులు 40 శాతం వాటాతో దేశంలో ఆంధ్రప్రదేశ్ అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉందని తెలిపారు. ఈ ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు త్వరలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ ప్రాంతీయ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి వెల్లడిస్తూ…

(వాయిస్ 26 సెకన్లు)

====================

పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవనంపై అవగాహన పెంచడానికి నిర్వహించే ప్రచార కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన ఈరోజు విజయవాడలోని లోక్‌భవన్ ఆవరణలో ఎర్ర జామ మొక్కను నాటారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ… పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ దిశగా చర్యలను వేగవంతం చేయడంపై దృష్టి సారించాలన్నారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 'ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం.. మన భవిష్యత్ కోసం' అనే ఇతివృత్తంతో జరుపుకుంటున్నామని అన్నారు.

విరామం

====================

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి.. దానిని సంరక్షించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ జిల్లా, మూలపాడు బటర్ ఫ్లై పార్క్ లో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… 'ఏక్ పేడ్ మా కె నామ్' థీమ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట కనీసం ఒక మొక్క నాటాలన్నారు. మనం నాటే ప్రతి మొక్క మహావృక్షం కావాలని, ప్రతి చెట్టు వాతావరణ మార్పులపై రక్షణ కవచంగా నిలుస్తుందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడంలో రాష్ట్రంలోని ప్రతి పౌరుడు ఒక భాగస్వామి కావాలని, ఆరోగ్యకరమైన, వాతావరణ మార్పులను తట్టుకోగల ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని ఉప ముఖ్యమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 24 సెకన్లు)

====================

గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆకాంక్షించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గిరిజన పాఠశాలల విద్యార్థులను, ఉపాధ్యాయులను విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈరోజు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ… ప్రభుత్వం గిరిజన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి విద్యార్థిపై దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చు చేస్తున్నామని.. నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని మంత్రి సూచించారు.

====================

రష్యా పర్యటనలో భాగంగా రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్.. ట్రాన్స్ మాష్ హోల్డింగ్ జెఎస్సీ నిర్వాహకులతో సెయింట్ పీటర్స్ బర్గ్ లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్.. తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఆల్‌స్టోమ్ మెట్రో రోలింగ్ స్టాక్ సదుపాయానికి ఆనుకొని ఒక ప్రధాన రైలు విడిభాగాల అసెంబ్లీ ప్లాంట్‌ను స్థాపించాలని వారిని ఆహ్వానించారు. అలాగే.. దక్షిణాసియా అంతటా భారీ పారిశ్రామిక రైలు ప్రాజెక్టులకు సరఫరా చేసేందుకు అధిక సామర్థ్యం గల సరుకు రవాణా లోకోమోటివ్, బోగీ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కాగా.. ట్రాన్స్ మాష్ హోల్డింగ్స్ జెఎస్ సీ ప్రతినిధులు.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలియజేశారు.

====================

పర్యావరణ పరిరక్షణలో చెట్ల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ.. ఆమె ఈరోజు విజయవాడ రామవరప్పాడు నుండి ఆటోనగర్‌లోని ఫైర్ స్టేషన్ కార్యాలయం వరకు సైకిల్‌పై ప్రయాణించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారం నో వెహికల్ డే పాటిస్తూ.. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడటమే భావితరాలకు మనం అందించే గొప్ప ఆస్తి అని వ్యాఖ్యానించారు. సైకిల్ వినియోగం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయని హోం మంత్రి పేర్కొన్నారు.

====================

రానున్న 2, 3 రోజుల్లో నైరుతి రుతుపవనాలు మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, గోవా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు ఈశాన్య రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల  కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

====================

అమ్మ పేరుతో ఒక మొక్క ఒక సాధారణ పర్యావరణ కార్యక్రమం మాత్రమే కాదని.. పవిత్రమైన ప్రజా ఉద్యమాన్ని సృష్టించిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని బీజేపీ కార్యాలయం ఆవరణలో ఆయన ఈరోజు తన మాతృమూర్తి జ్ఞాపకార్థం ఒక మొక్కను నాటారు.

====================
====================